03.07.2020



## 1-97

### మున్నుడి

శ్రీవేంకటేశ్వరునికి ప్రతి శుక్రవారము అభిషేక మహోత్సవం జరుగుతుంది. తిరుమలలో కన్నులపండువగా జరిగే స్వామివారి అభిషేక వైభవాన్ని కళ్లకు గట్టినట్లు వర్ణిస్తున్నారన్నమయ్య. మనబోటి వాళ్ళు జీవితంలో ఏ ఒక్కసారో కన్నులారా స్వయంగా చూడగలిగే ఆ ఉత్సవం దేవతలు కూడా బారులు తీరి నింగి నుండి తిలకిస్తారట. అప్పుడు దేవదుందుభులు మ్రోగుతాయట. ఆ శృంగారాలొలికే దేవుని కనులారా దర్శించి సేవించండంటున్నారన్నమయ్య. ఈ కీర్తనలో తేలికగా అర్థం కాని మాటలు బాగానే ఉన్నాయి. చదివి ఆ విశేషాలు తెలుసుకోండి.

ఆ.వె॥ స్వామి సేవయైన స్నానంపు ముచ్చట
తెలిపి రన్నమయ్య తేటతెలుగు
కీర్తనంబు లోన కేశవు గొలిచిరి
ఎన్ని మెలికలున్న విందులోన!!

రాగం : ఖరహరప్రియ

దేవదుందుభులతోడ తేటతెల్లమైనాడు
సేవించరో యిదే వీడే సింగార దేవుడు ॥దేవ॥

బంగారుమేడలలోన పన్నీట మజ్జనమాడి
అంగము తడియొత్తగా నదె దేవుడు
ముంగిట పులుకడిగిన ముత్యమువలెనున్నాడు
కుంగని రాజసముతో కొండవంటి దేవుడు ॥దేవ॥

కాంతులు మించిన మాణికపు తోరణములకింద
అంతట కప్పురము చాతుకదే దేవుడు
పొంతల నమృతమే పోగైనట్టున్నవాడు
సంతతము సంపదల సరిలేని దేవుడు ॥దేవ॥



Scanned with CamScanner

తట్టుపుణుగు నించుక దండిసొమ్ములెల్లాబెట్టి
అట్టె అలమేల్మంగ నరుతగట్టి
నెట్టన నమ్మినవారి నిధానమై వున్నవాడు
పట్టపు శ్రీవేంకటాద్రిపతియైన దేవుడు ॥దేవ॥

## భావామృతం

నింగిలో దేవతలంతా నిలిచి ఈ అభిషేకోత్సవాన్ని కన్నుల పండుగగా చూస్తూ దేవదుందుభులను ప్రయోగిస్తున్నారు. అప్పుడీ శృంగార పురుషుడు ప్రకాశమానమవుతున్నాడు. ఇదిగో ఈయనే.. రారండి మీరంతా ఈ స్వామిని సేవించండి.

ఈ స్వామికెన్నో బంగారు మేడలున్నాయి. ఆ మేడలో ఈయనకు పన్నీటితో స్నానం చేయించారు. అవయవముల కంటిన తడిని జాగ్రత్తగా తుడిచి వేస్తున్నారు. అదిగో చూడండి. ఈయన కడిగిన ముత్యమువలె నున్నాడు. ఆ కడుగుట కూడ ఊరకనే నీటితో కాదు అవి పులుకడిగిన ముత్యములు. అంటే చింతపండు పులుసు వేసి మరీ కడిన ముత్యాలు. అందుకని మిలమిలా మెరిసిపోతున్నాయి. ఇకపోతే పర్వత సమానుడైన ఉన్నతుడు కాబట్టి ఏమాత్రం తగ్గని రాజసం వుట్టిపడుతుంటే ఈ దేవుడు మనోహరంగా ఉన్నాడు చూడండి.

ఈయన వెలుగులు వెదజల్లే మాణిక్యపు మకర తోరణముల క్రింద చక్కగా కర్పూరం అద్దుకొన్నమేని శోభతో విరాజిల్లుతున్నాడు. దేవుడు అంటే ఈయననే. అమృతమంతా యొకచోట చేర్చినట్లున్న ఈయనను అతి సమీపమునుండి తిలకించండి. అంతులేని సంపదలు కల ఈ సాటిలేని దేవుని తిలకించి తరించండి.

చేతులతో తట్టి, ఒత్తుతూ తయారుచేసిన పునుగు జవ్వాది ఈస్వామి ఒంటినిండా అద్ది యున్నారు. రంగులీను రత్నాభరణాలతో విశేషంగా అలంకరించారు. అదేవిధంగా సిద్ధంగా ఉన్న అలమేల్మంగమ్మను ఈయన "అరుతగట్టు" కొన్నాడు (అంటగట్టుకొన్నాడు) ఈయన ఒక నియమబద్ధంగా నమ్మినవారికి కొంగుబంగారమైన మహానుభావుడు. వేంకటాద్రిమీద ఈయన వేంకటపతియై పట్టాభిషిక్తుడైన మహానుభావుడు.



Scanned with CamScanner

03-07-2020

దేసాళం

దేవదుందుభులతోడ తేటతెల్లమైనాఁడు
సేవించరో యిదే వీఁడే సింగారదేవుఁడు. ॥పల్లవి॥

బంగారుమేడలలోనఁ బన్నీట మజ్జనమాడి
అంగముతడి యొత్తఁగా నదే దేవుఁడు
ముంగిటఁ బులుకడిగినముత్యమువలె నున్నాఁడు
కుంగనిరాజసముతో కొండవంటిదేవుఁడు. ॥దేవ॥

కాంతులుమించినమాణికపుదోరణముకింద
అంతటఁ గప్పురముచాతు కదే దేవుఁడు
పొంతల నమృతమే పోగై నట్టున్న వాఁడు
సంతతము సంపదలసరిలేనిదేవుఁడు ॥దేవ॥

తట్టుపుణుఁగు నించుక దండిసొమ్ములెల్లాఁ బెట్టి
అట్టెలమేల్మంగ నరుతఁ గట్టి
నెట్టన నమ్మినవారినిధానమై వున్న వాఁడు
వట్టపు శ్రీవేంకటాద్రిపతియైనదేవుఁడు. ॥దేవ॥ 125

Scanned with CamScanner